క్లుప్తంగా

ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలి

ముమ్మిడివరం: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోతే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా తయారవుతుందని ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ అన్నారు. అమలాపురంలో సోమవారం నిర్వహించిన ఫీజుపోరు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాల యాజమాన్యం ఫీజులు చెల్లించాలని విద్యార్థులను ఒత్తిడి చేయడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పేద విద్యార్థుల తల్లితండ్రులు ఫీజులు చెల్లించలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు కనీసం డీఎస్సీ కూడా పూర్తి చేయలేదన్నారు. నిరుద్యోగ భృతి ఊసే లేదని విమర్శించారు. తల్లికి వందనం కోత విధించడం సబబు కాదన్నారు.

ఘనంగా బిల్వార్చన



మురమళ్ల వీరేశ్వరస్వామి

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంలో జ్యేష్ఠ మాసం మాస శివరాత్రి మహా పర్వదినం పురస్కరించుకుని సోమవారం లక్ష పత్రి పూజ ఘనంగా నిర్వహించారు. పురోహితులు బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణ మూర్తి ఆధ్వర్యంలో లక్ష పత్రి పూజ నిర్వహించారు. తొలుత గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం బిల్వార్చన నిర్వహించారు. లక్ష పత్రి పూజలో తొమ్మిది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు

తాగునీరు, పారిశుధ్య సమస్యలు పరిష్కరిస్తాం



వార్డులో సమస్యలపై ఆరా తీస్తున్న మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, అధికారులు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలోని 30వ వార్డు నుంచి తాగునీటి, పారిశుధ్య సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేయడంతో కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తన సిబ్బందితో ఆ వార్డులో సోమవారం పర్యటించారు. కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో తాగునీటి సరఫరాలో అవాంతరాలు, పారిశుధ్య పనులు సరిగా లేకపోవడం వంటి సమస్యలను వార్డు ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ప్రజలకు స్పష్టం చేశారు. మున్సిపల్ డీఈఈ సత్యనారాయణ, ఏఈలు వెంకటేష్, సూర్యభాస్కరరావు, కృష్ణ, వార్డు సచివాలయల ఉద్యోగులు, వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన ర్యాలీ

అల్లవరం: జాతీయ క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా బోడసకుర్రు సచివాలయం-1 పరిధిలోని పల్లిపాలెంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి పౌష్టిహారం ప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రత్నకుమారి, పద్మ, దుర్గప్రసాదు, నల్లి విజయకుమారి, రాపాక సౌమ్య, సాపే సుజాత పాల్గొన్నారు.

నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించాలి

యానాం: పుదుచ్చేరిలో నాలుగు రీజియన్లలో పారిశ్రామిక పరిస్థితిపై ఎల్జీ కె.కై లాషనాథన్ ఇటీవల చేసిన పరిశీలనలపై స్పందిస్తూ మాజీ ఎంపీ పుదుచ్చేరి మానిల మక్కల్ మున్నేట్రకజగం(పీఎమ్ఎమ్ఎమ్‌కే) అధ్యక్షుడు ఎం.రామదాసు సోమవారం విలేకరులతో మాట్లాడారు. మంత్రులు, అధికారుల్లో ఆలోచనామార్పుతో పాటు పరిపాలనలో సాంస్కృతిక మార్పు మాత్రమే కేంద్రపాలిత ప్రాంతం పారిశ్రామిక రంగంలో పురోగతి సాధిస్తుందని ఆయన అన్నారు. ప్రస్తుత ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమి ప్రభుత్వం కేంద్రపాలిత ప్రాంతానికి నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించాలని ఆయన సూచించారు.

ఎంటెక్, ఎంసీఏ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: 2025-26 విద్యాసంవత్సరానికి పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులైన ఎంటెక్, ఎంసీఏ, ఎంబీఏ, ఎంఎస్సీ (మెటీరియల్ టెక్నాలజీ) కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సోమవారం పీజీఏసీ అడ్మిషన్ కమిటీ చైర్మన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జూలై1 నుంచి 15 వరకు పీటీయూఎస్‌వీ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అడ్మిషన్లను పాండిచ్చేరి సాంకేతిక విశ్వవిద్యాలయం నిర్వహిస్తుందని తెలిపారు.

ఇష్టారాజ్యంగా కాలువ ఆధునీకరణ

- నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు
- కానరాని అధికారుల పర్యవేక్షణ
- ఛిద్రమైన బీటీ రోడ్డు
- ప్రయాణానికి అవస్థలు



పల్లంకుర్రులో నాణ్యతాప్రమాణాలు పాటించకుండా పంట కాలువ ఆధునీకరణ పనులు



పల్లంకురులో తవ్వేసిన బీటీ రోడ్డుకు, కాలువ కాంక్రీట్ వాల్‌కు మధ్య ఖాళీ ప్రదేశం పూడ్చివేతకు వేసిన బంక మట్టి

కాట్రేనికోన: బొబ్బర్లంక- పల్లంకుర్రు బ్యాంకు కెనాల్‌పై పల్లంకుర్రు- 2 వద్ద ఇరిగేషన్ శాఖ చేపట్టిన రెగ్యులేటర్, రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనులు కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టుందనే ఆరోపణలు వస్తున్నాయి. గోదావరి సెంట్రల్ డెల్టా ఆధునీకరణలో భాగంగా బొబ్బర్లంక నుంచి పల్లంకుర్రు వెళ్లే బ్యాంకు కెనాల్‌పై సుమారు కోటి రూపాయలతో పనులు చేపట్టారు. ప్రధాన కాలువ నుంచి ఎస్ సావరం వెళ్లే పంట కాలువకు అయినాపురం వద్ద రిటర్నింగ్ వాల్, రెగ్యులేటర్, కుండలేశ్వరం వెళ్లే కాలువకు రెగ్యులేటర్, ఎస్ కొత్తపల్లి పంట కాలువకు మూడు బాక్సుల కల్వర్టు, పల్లంకుర్రు -2 లాకు వద్ద రిటర్నింగ్ వాల్, రెగ్యులేటర్ నిర్మాణ పనులు చేపట్టారు. పనులను పర్యవేక్షించాల్సిన ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేయడంతో నాణ్యత లోపిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. పనులకు సమపాళ్లలో అవసరమైన మెటీరియల్ వాడలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

తొలకరి సాగుపై ప్రభావం

ఆధునీకరణ పనుల కారణంగా పంట కాలువ శివారు ప్రాంతాలకు సాగునీరందక తొలకరి పంటకు నారు మడులు వేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలకరి పంటకు నారు మడులు వేసుకునేందుకు ఆలస్యం కావడంతో పంట చేతికి వచ్చేసరికి వర్షాకాలంలో ముంపు బెడద తప్పదని రైతులు వాపోతున్నారు. బలుసుతిప్ప మంచి నీటి ప్రాజెక్టు చెరువులలో నీటి మట్టం అడుగంటడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు.

బలుసుతిప్ప రోడ్డు ధ్వంసం

గత ప్రభుత్వంలో పల్లంకుర్రు-బలుసుతిప్ప వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డుకు 2021-22లో 2.900 కి.మీ మేర మరమ్మతుల కోసం నిధులు రూ.81.10 లక్షలు, 2023-24లో ఇంప్రూవ్‌మెంట్ సర్‌ఫేస్ రైడింగ్ కింద 2.900 కి.మీ.- 6.920 కి.మీ. మేర రూ.కోటి 50 లక్షలలో బీటీ రోడ్డు పనులు చేపట్టారు. పంట కాలువపై ఇరిగేషన్ అధికారులు చేపట్టిన రిటర్నింగ్ వాల్, రెగ్యులేటర్ పనుల కోసం పొక్లెయిన్‌తో బలుసుతిప్పకు వెళ్లే బీటీ రోడ్డును కొంతమేర తవ్వేసారు. ఆటో మాత్రమే వెళ్లే చిన్నపాటి రోడ్డుపైనే బలుసుతిప్ప, రామాలయంపేట, మొక్కలతిప్ప, సాపేవారిపేట, ఐ.చెరువు, బూలవారిపేట గ్రామాల ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారు. పంట కాలువకు నిర్మించిన కాంక్రీట్ వాల్‌కు, తవ్వేసిన రోడ్డుకు మధ్యలో జిగురు బంకమట్టిని వేస్తున్నారు. జనిపెల్లివారిపేట నుంచి పల్లంకుర్రు - 2 లాకు వరకు సుమారు కిలో మీటరు పైబడి దూరం వరకూ బీటీ రోడ్డు భారీ వాహనాల రాకపోకలతో దిగబడుతోంది. కాంక్రీట్ వాల్ నిర్మాణ పనుల కోసం రోడ్డును తవ్వేయడంతో అధ్వానంగా తయారైంది. తవ్వేసిన రోడ్డును బంకమట్టితో పూడ్చడంపై పులువురు మండి పడుతున్నారు. సత్తెమ్మ మర్రి లాకు వద్ద నిర్మాణం కోసం తవ్విన రోడ్డు గోతులను పంట కాలువలోని మట్టితో మొక్కుబడిగా పూడ్చడంతో కుంగిపోతోంది. ఇక్కడ పంట కాలువకు కాంక్రీట్ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

మట్టి తరలించేందుకు సిద్ధం

పంట కాలువలోని మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వేసి రక్షణ గట్టుపై వేసిన కాంట్రాక్టరు మట్టిని తరలించేందుకు సిద్ధమవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మట్టితో కాలువ వెంబడి గట్టును బలపరచాలని రైతులు కోరుతున్నారు. అధికారుల పర్యవేక్షణలేకపోవడంతో కాంట్రాక్టరు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. తవ్వేసిన రోడ్డుకు కాంక్రీట్ వాల్‌కు మధ్య ఇసుకతో కూడిన మట్టిని వెయ్యాలని, బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తవ్వేసిన రోడ్డు పనులు నాణ్యతతో చేయకుంటే రోడ్డు దిగబడి అనేక ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉంది. శివారు ప్రాంతాల నుంచి జిల్లా, మండల కేంద్రం అమలాపురం, కాట్రేనికోనకు రోజూ వందల మంది విద్యార్థులు పాఠశాలలకు, ప్రయాణికులు బస్సులు, ఆటోలు ఇతర వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. సంబంధించిన అధికారులు అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

కాలువ గట్లను పటిష్టం చేస్తాం

పల్లంకుర్రు పంట కాలువ కాంక్రీట్ వాల్-రోడ్డుకు మధ్యలో ఫిల్లింగ్‌కోసం ఇసుకతో కూడిన మట్టిని మాత్రమే వాడతాం. ఏటిగట్టు వైపు వేసిన పంట కాలువ మట్టిని బయటకు తరలించకుండా కాలువ వెంబడి గట్టును బలపరిచేందుకు వినియోగిస్తాం.

– పవన్‌కుమార్, ఇరిగేషన్, ఏఈ

రోడ్డు తవ్వేశారు



పల్లంకుర్రు - బలుసుతిప్ప రోడ్డును సత్తెమ్మ మర్రి సెంటర్ వద్ద పంట కాలువ ఆధునీకరణ పనుల పేరుతో తవ్వేశారు. రోడ్డుకు, కాంక్రీట్ వాల్‌కు మధ్యలో ఫిల్లింగ్ కోసం ఇసుక కాకుండా బంకమట్టిని వాడుతున్నారు. బీటీ రోడ్డు పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలి. ప్రతి రోజు పాఠశాలలకు, కాలేజీలకు బస్సులు, ఆటోల్లో విద్యార్థులు వందలాది మంది వెళుతున్నారు. వర్షాకాలం రోడ్డు దిగబడితే ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉంది.

– పులుగు దశరథమహారాజు, పల్లంకుర్రు

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒలింపిక్ డే రన్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఉప్పలగుప్తం: కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సౌజన్యంతో మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం జి.కనకదుర్గ ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్‌ను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పాఠశాల విద్యార్థులు, సీఏఎస్ఎం కాలేజీ విద్యార్థులు వ్యాయామ ఉపాధ్యాయుల సమక్షంలో ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తూ క్రీడాజ్యోతి పట్టుకుని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ తండ్రి విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు దివంగత రంకిరెడ్డి కాశీ విశ్వనాథం చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వాలా సత్యనారాయణ మూర్తి, పీడీలు కామన మధుసూదన్ రావు, గొలకోటి ఫణీంద్ర, దూలం సరస్వతి, స్వాతి, కరాటం ప్రసాద్, నూకల సీతాపతి, వి.విజయ భాస్కర్, భీమనపల్లి ఎంపీటీసీ సభ్యురాలు దేశంశెట్టి నాగరత్నకుమారి, అరిగెల నానాజీ, గుత్తాల సుభాష్ చంద్రబోస్, చీకట్ల ఏసుబాబు పాల్గొన్నారు.

ధాన్యం సొమ్ము తక్షణమే జమ చేయాలి



తాళ్లరేవు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

తాళ్లరేవు: గత మే నెలలో విక్రయించిన ధాన్యానికి ఇప్పటి వరకు డబ్బులు జమ చేయలేదని, దీనిపై తక్షణమే పాలకులు స్పందించాలని కోరుతూ రైతులు ధర్నా నిర్వహించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు, కౌలుదారులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా చేసారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు టి.ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలతోపాటు ప్రధానంగా పి.మల్లవరం గ్రాంటు గ్రామానికి చెందిన చిన్న, సన్నకారు రైతులు ధాన్యం డబ్బులు జమ అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అప్పులు చేసి సాగు చేస్తున్నారని, ప్రభుత్వం తాత్సారం చేస్తే వడ్డీలు పెరిగి రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతారన్నారు. రైతు మేడిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత మే నెలలో సీఎంఆర్ ద్వారా ధాన్యం తూకం వేశామని, 50 రోజుల గడుస్తున్నా డబ్బులు వేయలేదని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రస్తుతం విత్తనాలు కొనుక్కునేందుకు కూడా అప్పు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తక్షణమే అధికారులు స్పందించి ధాన్యం డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా అఖిల్ బాధ్యతల స్వీకరణ



ఆర్‌పీఓ మునిస్వామిని కలిసిన నూతన కమిషనర్ అఖిల్

యానాం: మున్సిపల్ నూతన కమిషనర్‌గా ట్రైనీ ఐఏఎస్ అధికారి బుద్ధి అఖిల్ సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు మున్సిపల్ ఉద్యోగులు, పెన్షనర్ల సంఘ ప్రతినిధులు కలిసి శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. అంతకు ముందు రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామిని అఖిల్ మర్యాదపూర్వకంగా కలిసారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దృష్టి సారించనున్నట్టు తెలిపారు.

ఈదరపల్లి పాత వంతెనపై రాకపోకల పునరుద్ధరణ



ఈదరపల్లి పాత వంతెనపై వెళుతున్న వాహనాలు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ ప్రవేశమైన ఈదరపల్లి పాత వంతెన పక్కనే కొత్త వంతెన నిర్మిస్తున్న క్రమంలో పాత వంతెనపై నుంచి నిలిపేసిన వాహనాల రాకపోకలు సోమవారం నుంచి తిరిగి అధికారికంగా పునఃప్రారంభమయ్యాయి. ఈదరపల్లితో పాటు నడిపూడి కాలువపై నిర్మిస్తున్న రెండు వంతెనల నిర్మాణాల వల్ల దాదాపు 40 రోజుల క్రితం పట్టణ పోలీసులు మూడు మార్గాల్లోకి ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయంగా మళ్లించిన విషయం విదితమే. ఇప్పుడు ఈదరపల్లి పాత వంతెనపై కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలను పునరుద్ధరించడంతో 40 రోజుల ట్రాఫిక్ కష్టాలకు తెరపడింది. పాత వంతెనపై ఆదివారం నుంచే ద్విచక్ర వాహనాలు వెళ్లినప్పటికీ సోమవారం నుంచి అధికారికంగా కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళుతున్నాయి. ఈ వంతెన నిర్మాణం వల్ల సమీపంలోని పంట కాలువపై క్రాస్ బండ్ నిర్మించి దానిపై నుంచి పట్టణంలోకి ప్రవేశానికి కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకు మాత్రమే వెసులబాటు కల్పించిన సంగతి తెలిసిందే. ఈ వంతెనపై నుంచి వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులను బస్‌స్టేషన్ నుంచి తోట్లపాలెం మీదుగా అంబాజీపేట సెంటరుకు చేరుకునేలా ట్రాఫిక్ మళ్లించారు. అదే విధంగా లారీలు, హైటెక్ బస్సులను అమలాపురం నల్లవంతెన మీదుగా నేదునూరు మీదుగా లేదా నడిపూడి నుంచి ముక్కామలకు మళ్లించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆర్టీసీ బస్సులు, లారీలు, హైటెక్ బస్సులకు ఈదరపల్లి పాత వంతెనపై నుంచి వెళ్లేందుకు ఇంకా అధికారులు అనుమతులు ఇవ్వలేదు. ముందు ప్రకటించినట్లుగానే ఆర్టీసీ బస్సులు, లారీలు, హైటెక్ బస్సులు ట్రాఫిక్ మళ్లింపుతో ఆయా ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సిందే. బస్సులు, లారీలు ఈదరపల్లి పాత వంతెనపై నుంచి వెళ్లేందుకు మరి కొన్ని రోజులు ఆంక్షలు కొనసాగనున్నాయి. కొత్త వంతెన నిర్మాణం దాదాపు పూర్తయిన అనంతరం భారీ వాహనాలకు అనుమతి ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. 40 రోజులపాటు అమలాపురం పట్టణంలోకి ప్రవేశించేందుకు లేదా పట్టణం మీదుగా ఏదైనా ప్రాంతానికి వెళ్లేందుకు ముఖ్యంగా కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనచోదకులు అవస్థలు ఎదుర్కొన్నారు. పోలీసుల ఆంక్షల వల్ల పట్టణంలోకి వెళ్లాలంటే దాదాపు 20 నిమిషాలు అదనంగా సమయం పట్టేది. దీంతో వాహన చోదకులు పట్టణంలోకి ప్రవేశించేందుకు దగ్గర తోవ కోసం నాలుగు మార్గాల ద్వారా ఇబ్బందులు ఎదురైనా తట్టుకుని తక్కువ సమయంలో పట్టణంలోకి ప్రవేశించేవారు. ఇప్పుడు ఆ ట్రాఫిక్ కష్టాలన్నీ దూరమై పాత వంతెనపై వెళ్లేందుకు వెసులబాటు రావడంతో అందరూ ఊపిరి పీల్చుకుంటున్నారు.

హోరెత్తించిన 'యువత పోరు'



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ నాయకులు, యువకులు



అమలాపురంలో శ్రీకాంత్, నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

- భారీగా తరలివచ్చిన విద్యార్థులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు
- కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ ర్యాలీ

అమలాపురం రూరల్/ ఉప్పలగుప్తం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ వైఎస్సార్ సీపీ అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థి యువత పోరు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు తమ నిరసన తెలిపారు. జిల్లాలోని నలుమూలల నుంచి విద్యా ర్థులు, యువతీ, యువతులు పెద్ద ఎత్తున జిల్లా కేంద్రం అమలాపురానికి తరలివచ్చి ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వం అందిస్తానన్న నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వారికి వైఎస్సార్ సీపీ నేతలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున మద్దతు తెలిపి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. నియోజకవర్గం కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో అమలాపురంలోని నల్ల వంతెన వద్ద వంటెద్దు వెంకన్నాయుడు కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు వందలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు.

అడుగడుగునా అడ్డంకులు

అడుగడుగునా అనుమతుల్లేవంటూ పోలీసులు అడ్డుకుని అవరోధాలు సృష్టించినా యువత వాటిని అధిగమించి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో రాజకుమారికి వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బాకాయిలు, ఎన్నికల ముందు ఇస్తానన్న నిరుద్యోగ భృతి రూ. 3వేలు, ఏటా 5 లక్షల ఉద్యోగాల హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పార్టీ పట్టణ, రూరల్ అల్లవరం, ఉప్పలగుప్తం, అంబాజీపేట, పి.గన్నవరం మండలాల అధ్యక్షులు సంసాని బుల్లి నాని, గుత్తుల చిరంజీవిరావు, బద్రి బాబ్జి, కొనుకు బాపూజీ, విత్తనాల శేఖర్, ముత్తాబత్తుల ఆనంద్, ఎంపీపీలు కుడిపూడి భాగ్యలక్ష్మి, యిళ్ల శేషారావు, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, గెద్దం సంపదరావు, కొనుకు గౌతమి, మున్సిపల్ చైర్మన్ పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్, జిల్లా కార్యదర్శులు సరేళ్ల రామకృష్ణ, కముజు రమణ, పార్టీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, కూడుపూడి వెంకటేశ్వరబాబు, యువజన విభాగం అధ్యక్షుడు దూడలఫణి, కేతా భాను తేజ. ఓగూరి విజయ కుమార్, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, పెయ్యిల రాజ్‌కుమార్ యర్రంశెట్టి రామచంద్రరావు, జొన్నాడ శ్రీదుర్గ, వడ్డి గంగ, కౌన్సిలర్లు కొల్లాటి దుర్గాబాయి, చిట్టూరి పెదబాబు, గొవ్వాల రాజేష్, చిత్రాపు రామకృష్ణ, నాయకులు నక్కా సంపత్‌కుమార్, ఈతకోట శ్రావణ్, కుంచే స్వామి, బడుగు శ్రీనువాస్, కోరుకొండ కిరణ్, దూనబోయిన రవికుమార్, చేట్ల రామారావు, కుమ్మరి అభి పాల్గొన్నారు.

దండోరా నూతన కమిటీ ఎన్నిక



అమలాపురం దండోరా కమిటీ నూతన కార్యవర్గ ప్రతినిధులతో నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ మాదిగ దండోరాకు నూతన కమిటీ ఏర్పాటైంది. స్థానిక మున్సిపల్ కాలనీలో సోమవారం నిర్వహించిన దండోరా ముఖ్య నాయకుల సమావేశం పట్టణ కమిటీకి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీకవంగా ఎన్నుకుంది. దండోరా సీనియర్ నాయకుడు గంపల సత్యప్రసాద్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి దండోరా జిల్లా ఇన్‌ఛార్జి డాక్టర్ సామ్రాట్ మధు, జిల్లా దండోరా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి, కో ఇన్‌చార్జి డాన్ సూరి మాదిగ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పట్టణ దండోరా నూతన కమిటీ అధ్యక్షుడిగా గంపల విజయ్, గౌరవాధ్యక్షుడిగా పాపగంటి కోటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తోమంద్ర విజయ్, అధికార ప్రతినిధిగా దువ్వ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పలివెల క్రాంతికుమార్, ఉపాధ్యక్షుడిగా కంద్రకోట నవీన్, కంకిపాటి మోహన్ తేజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం: వచ్చే నెల జూలై 7న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ రోజు ప్రతి మాదిగ ఇంటి ముందు దండోరా జెండా ఎగుర వేయాలని సీనియర్ నాయకుడు గంపల సత్య వరప్రసాద్ పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌గా బాలరాజు

యానాం: యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా పీఏ బాలరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది ఆయను ఘనంగా సత్కరించారు. ఇప్పటి వరకు బాలరాజు పుదుచ్చేరి ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా వ్యవహరించి బదిలీపై యానాం వచ్చారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సాధనాల బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని విద్యార్థులకు గాయాలు

రాజోలు: గ్యాస్‌బండ్‌ల లోడ్ వ్యాన్ ఢీ కొని చింతలపల్లి కొత్త కాలనీకి చెందిన విద్యార్థులు కొల్లి జాన్, కొల్లి జెస్సిక సోమవారం గాయపడ్డారు. కొత్తకాలనీకి చెందిన జాన్ కూనవరం ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. పాఠశాల నుంచి ఇంటికి సైకిల్‌పై తిరిగి వస్తూ చింతలపల్లి ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న చెల్లెలు జెస్సికను సైకిల్‌పై ఎక్కించుకుని ఇంటికి వెళ్తుండగా వెనుక వైపు నుంచి గ్యాస్‌బండ్‌ల లోడ్ వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సైకిల్ చక్రం విరిగిపోవడంతో అన్నాచెల్లెళ్లు ఇద్దరూ కిందపడిపోయారు. దీంతో జాన్ కుడికాలు విరిగిపోగా, జెస్సికకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిద్దరినీ రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా జాన్ కుడి కాలుకు శస్త్ర చికిత్స చేయించాలని వైద్యులు సూచించడంతో జాన్‌ను రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎంఈఓలు నల్లి మనోహరం, ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనంద రాజులు ఆస్పత్రికి వచ్చి గాయపడ్డ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

29న బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష

యానాం: బీఎస్సీ నర్సింగ్‌లో సెంటాక్ ప్రభుత్వ కోటా సీట్ల భర్తీకోసం ఈనెల 29న ఆదివారం రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వి.రవిచంద్రన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థుల కోసం యానాం -1, పుదుచ్చేరి-5, కారైకల్-2 ,మాహే-1లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను సెంటాక్ పుదుచ్చేరి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 0413-2229355 నంబరును సంప్రదించాలని కోరారు.

కేశవస్వామి భూముల కౌలు వేలం

తాళ్లరేవు: కేశవపురం గ్రామంలోని శ్రీదేవీ, భూదేవీ సమేత కేశవస్వామి ఆలయానికి చెందిన 24.42 ఎకరాలకు సంబంధించి కౌలుకు ఇచ్చేందుకు నిర్వహించిన వేలం ద్వారా రూ.9 లక్షలు ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. పోలేకుర్రులోని సర్వే నంబరు 187, 224, 195-1, 185-1 భూములకు సంబంధించి ఇటీవల బహిరంగ వేలం నిర్వహించగా జక్కల శ్రీనివాసవెంకటప్రసాద్‌బాబు రూ.9 లక్షలు చెల్లించేందుకు ముందుకు వచ్చినట్టు తెలిపారు. గత శిస్తు రూ.7.5 లక్షలు కాగా మరో రూ.1.5 లక్షల ఆదాయం పెరిగినట్లు ఈఓ తెలియజేసారు.

కురంగేశ్వరునికి లక్ష రుద్రాక్ష పూజ

తాళ్లరేవు: పాతకోరంగి బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి లక్ష రుద్రాక్ష పూజను సోమవారం ఘనంగా నిర్వహించారు. మాసశివరాత్రి సందర్భంగా ఆలయ అర్చకులు కేఆర్‌కే సాయిప్రసాద్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష రుద్రాక్షలతో అభిషేకించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

రాయవరం: భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో అఖండ భారతావని కోసం ప్రాణాలర్పించిన జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ 72వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. మండలంలోని సోమేశ్వరంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ కార్యక్రమం బీజేపీ మండల అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి దుర్గా శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరాల రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిరట్ల సుబ్బారావు, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నాయకులు అంగర జనార్దన స్వామి పాల్గొన్నారు.